# టీ-మీడియా

మెయిన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 277
పేజీలు : 3

బుధవారం-06 మే, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## టీవీకే పార్టీ శాసనసభాపక్ష నేతగా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నిక

**టి మీడియా , మే 5 , చెన్నై :**



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే పార్టీ శాసనసభాపక్ష నేతగా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా టీవీకే ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే సన్నాహాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు తన ఇంటి నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకున్న విజయ్, టీవీకే ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుపై ఆయన శాసనసభ్యులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంటూ ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోనప్పటికీ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ తమిళనాడు గవర్నర్‌కు విజయ్ లేఖ రాసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. తమిళనాడు ఎన్నికల్లో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించిన నేపథ్యంలో అసెంబ్లీలో తమ బలాన్ని నిరూపించుకోవడానికి రెండు వారాల సమయం కావాలని గవర్నర్‌ను విజయ్ కోరినట్లు తెలుస్తోంది. అటు పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి రెండు స్థానాల్లోనూ విజయ్ భారీ గెలవడంతో నిబంధనల ప్రకారం ఒక సీటును వదులుకోవాల్సి ఉంటుంది. అయితే పెరంబూర్ నియోజకవర్గాన్నే విజయ్ అట్టిపెట్టుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 సీట్లను కైవసం చేసుకుంది. మ్యాజిక్ ఫిగర్ 118కి పది స్థానాల దూరంలో నిలిచిపోయింది.

## సీఎం పదవికి స్టాలిన్ రాజీనామా

- మేము చూడని విజయం లేదంటూ ప్రకటన

**టి మీడియా, మే 5, చెన్నై :**



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పరాజయం కావడంతో ఆ పార్టీ అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్‌కు పంపినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే డీఎంకే శ్రేణులను ఉద్దేశించి స్టాలిన్ ఎక్స్? వేదికగా భావోద్వేగ ప్రకటన చేశారు. అసెంబ్లీలో తమ పార్టీ

3లో..

## సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదు

- మమత సంచలన కామెంట్స్

**టి మీడియా , మే 5 , ఢిల్లీ బ్యూరో:**



బంగాల్ ఎన్నికల నిర్వహణపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఘాటు విమర్శలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాము ప్రజా తీర్పు వల్ల ఓడిపోలేదని, కుట్రతో పరాజయం పాలైనట్లు పేర్కొన్నారు. అందుకే తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తేలేదని ఆమె తేల్చి చెప్పారు. బంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత తనకు సంఘీభావం తెలిపేందుకు కాంగ్రెస్? అధినేత్రి సోనియా, అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేశారని చెప్పారు. ఇకపై

3లో..


## తెలంగాణలో సీఎంఆర్ఎఫ్ నిబంధనలు కఠినం

- ఇకపై మంత్రుల సిఫార్సులు చెల్లవు

3లో..

# అమ్మబోతే అడవి కొనబోతే కొరివి !









## గోధుమల ధర తగ్గినా దిగిరాని పిండి ధర

- దండుకుంటున్న దళారులు, బ్రాండెడ్ కంపెనీలు

**టి మీడియా , మే 5 , న్యూఢిల్లీ :**

గోధుమల ధర తగ్గితే ఏమవుతుంది? సహజంగానే గోధుమ పిండి ధర కూడా తగ్గుతుంది. తద్వారా ప్రజలకు ఊరట లభిస్తుంది. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా గోధుమల ధరలు తగ్గినప్పటికీ దాని ప్రభావం ఎక్కడా కన్పించడం లేదు. రైతులు గోధుమలను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వస్తున్నప్పటికీ మార్కెట్‌లో గోధుమ పిండి, బ్రెడ్ ధరలు మాత్రం దిగిరావడం లేదు. ఈ పరస్పర విరుద్ధ పరిస్థితికి కారణమేమిటి?.

**ఎందుకీ అంతరం?**

వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ చెబుతున్న దాని ప్రకారం ఇటీవలి కాలంలో గోధుమల ధరలు గణనీయంగా పడిపోయాయి. ఈ నెలలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని హోల్‌సేల్ మండీల్లో కిలో గోధుమల ధర రూ. 23 నుంచి రూ. 25 మధ్య నడుస్తోంది. చాలా వరకూ కిలో ధర రూ. 25.85 పలికినప్పటికీ అది ఎంఎస్‌పీ కంటే తక్కువగానే ఉంది. గత సంవత్సరం నరేంద్ర మోడీ ప్రభుత్వం గోధుమల కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ. 160 పెంచి రూ. 2,585గా నిర్ణయించింది. 2024-25లో ఇది రూ. 2,425గా ఉంది. గోధుమల ధర తగ్గినప్పుడు సహజంగానే పిండి ధర కూడా తగ్గాలి. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా రిటైల్ మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ. 36 నుంచి రూ. 40 మధ్య పలుకుతోంది. బ్రాండెడ్ ఉత్పత్తుల విషయానికి వస్తే కిలో ధర రూ. 40 నుంచి రూ. 50 మధ్య నడుస్తోంది. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి.

**దళారీ వ్యవస్థే కారణం**

ఇలా ఎందుకు జరుగుతోంది? ఇది రైతుకు నష్టమా లేక వినియోగదారుడికి లాభమా లేక వినియోగదారుడి పేరుతో వేరెవరైనా లాభాలు గడిస్తున్నారా అన్నదే ఇక్కడ ప్రశ్న. మధ్యవర్తుల వ్యవస్థ వేళ్లూనుకుపోయిందని, దీనంతటికీ కారణం అదేనని ఇండియా టుడే అనుబంధ డిజిటల్ పోర్టల్ కిసాన్‌తక్‌కు చెందిన వ్యవసాయ నిపుణుడు ఓం ప్రకాష్ తెలిపారు. కుటుంబం కడుపు నింపే రొట్టె చౌకగా దొరుకుతుందన్న ఆశ అడియాసే అవుతోందని ఆయన చెప్పారు.

గోధుమల ధర తగ్గడానికి, పిండి ధర పెరగడానికి మధ్య ఉన్న అంతరం సరఫరా వ్యవస్థలోని నిర్మాణాత్మక అసమతుల్యతను బయటపెడుతోంది. మండీ నుంచి మిల్లుకు, అక్కడి నుంచి మార్కెట్‌కు చేరే క్రమంలో గోధుమలు మిల్లింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, రవాణా, రిటైల్ పంపిణీ వంటి ప్రక్రియలను దాటాల్సి ఉంటుంది. ప్రతి దశలోనూ ఖర్చులు పెరుగుతుంటాయి. కానీ అంతకంటే ముఖ్యంగా లాభాల మార్జిన్ కూడా పెరుగుతుంది. ముడి సరుకు ధర తగ్గినప్పుడు లాభాల మార్జిన్లు సర్దుబాటు కావు.

**బ్రాండెడ్ కంపెనీల పెత్తనం**

గోధుమ పిండి ధర పెరిగినప్పుడు మిల్లు యజమానులు, కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారుల నెత్తిన వేస్తాయి. కానీ పిండి ధర తగ్గినప్పుడు ధరలను తగ్గించడంలో మీనమేషాలు లెక్కిస్తారు. లాభాల మార్జిన్‌ను కాపాడుకోవడానికి, వీలైతే దానిని మరింతగా పెంచుకోవడానికి వీలుగా వారు ఇలా వ్యవహరిస్తుంటారు.

గోధుమల ధరలు ఎందుకు తగ్గుతున్నాయనే ప్రశ్నకు ఓం ప్రకాష్ సమాధానమిస్తూ ఉత్పత్తి పెరుగుతుందన్న అంచనాలు, సరుకు పెద్ద ఎత్తున రావడం, ప్రభుత్వం వద్ద 2.2 కోట్ల టన్నుల నిల్వలు ఉండడం కారణమని చెప్పారు. 'మండీలలో గోధుమ పిండిని తక్కువ ధరకు అమ్ముతున్నారు. అదే మాల్స్‌లో దాని ఖరీదు ఎక్కువగా ఉంటోంది. ఇది కఠోర వాస్తవం. రైతు నష్టపోతుంటే అది వినియోగదారుడికి ఆదాగా మారడం లేదు. మధ్యవర్తులు, బ్రాండెడ్ కంపెనీలు లాభపడుతున్నాయి' అని తెలిపారు. ప్రస్తుతం ప్రముఖ బ్రాండెడ్ సంస్థలు గోధుమ పిండి మార్కెట్‌ను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నాయి. బ్రాండ్ విలువ, ప్యాకేజింగ్, పంపిణీ వ్యవస్థ వంటి అంశాలు ధరను ప్రభావితం చేస్తున్నాయి. అసంఘటిత రంగంలో పిండి మిల్లులు విద్యుత్ ఛార్జీలు, కార్మికులు, రవాణా వంటి స్థిర ఖర్చులను భరించాల్సి వస్తోంది.గోధుమల ధర పెరిగినప్పుడు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటుంది. నిల్వలపై పరిమితులు నిర్ణయిస్తుంది. ఎగుమతులపై ఆంక్షలు విధిస్తుంది.

బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుంది. ధర ఎంఎస్‌పీ కంటే తక్కువగా ఉన్నప్పుడు సేకరణను పెంచి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రయత్నిస్తుంది. అయితే ఈ మద్దతు అనేది రాష్ట్రాలన్నింటిలో ఒకేలా ఉండదు. ఫలితంగా అన్నదాతలు తమ పంటను తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ధరలు తగ్గినా వినియోగదారునికి కలిగే ప్రయోజనం స్వల్పమే. సేకరణ బలహీనంగా ఉన్నప్పుడు రైతులు అయిన కాడికి తమ పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. అదే సమయంలో రొట్టెల తయారీకి ఉపయోగించే గోధుమ పిండి కోసం వినియోగదారులు గరిష్ట ధరలు చెల్లిస్తూనే ఉన్నారు.పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలలో గోధుమల సేకరణ ఎక్కువగా జరుగుతుంది. అక్కడి ధరలు ఎంఎస్‌పీకి చేరువగా ఉంటాయి. గోధుమల సేకరణ పరిమితంగా ఉండే రాష్ట్రాలలో మాత్రం ధరలు పడిపోతుంటాయి. ఈ అసమానత రైతులు సంపాదించే దానికి, వినియోగదారుడు చెల్లించే దానికి మధ్య అంతరాన్ని మరింతగా పెంచుతోంది. మార్కెట్ నియంత్రణ సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ధరల పర్యవేక్షణ విభాగం ఉంటుంది. అయితే అది కేవలం సమాచారాన్ని సేకరిస్తోందా లేక అడ్డూ అదుపూ లేని ధరలను నియంత్రిస్తోందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గోధుమల ధర తగ్గితే రైతుకు గిట్టుబాటు ధర లభించదు. వినియోగదారుడికీ ఉపశమనం కలగదు. మరి ప్రయోజనం పొందేది ఎవరు? మధ్యలో ఉన్న కొద్ది మంది మాత్రమే.

## టీఎంసీ ఓటమిపై సంబరాలా

- కాంగ్రెస్ శ్రేణులకు రాహుల్ గాంధీ
- సీరియస్ వార్నింగ్

**టి మీడియా , మే 5 , ఢిల్లీ బ్యూరో :**

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్? కాంగ్రెస్? (టీఎంసీ) ఓటమిపై కాంగ్రెస్ పార్టీలోని కొందరు సభ్యులు మురిసిపోతుండడంపై, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోం, బంగాల్?లలో బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు బీజేపీ వేసిన ఒక పెద్ద ముందడుగు అని పేర్కొన్నారు. ప్రజలు చిల్లర రాజకీయాలు పక్కన పెట్టి, దేశం కోసం బీజేపీకి వ్యతిరేకంగా కలిసి పోరాడాలని ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు.కాంగ్రెస్?లోని కొందరు, ఇతరులు కొందరు బంగాల్?లో టీఎంసీ ఓటమిని చూసి సంబరపడిపోతున్నారు. వారు ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అసోం, బంగాల్? ప్రజల తీర్పును దొంగిలించడం అనేది భారత ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో బీజేపీ వేసిన ఒక పెద్ద ముందడుగు. స్వల్ప రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టండి. ఇది ఒక పార్టీకి లేదా మరొక పార్టీకి సంబంధించిన విషయం కాదు. ఇది భారతదేశానికి సంబంధించిన విషయం.



**మమతతో ఏకీభవిస్తున్నా!**

బంగాల్?లో బీజేపీ 100 కంటే ఎక్కువ సీట్లను లూటీ చేసిందని ఆ రాష్ట్ర మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషన్? బీజేపీ కమిషన్?గా మారిపోయిందని ఆరోపించారు. బంగాల్?లో బీజేపీ సాధించిన విజయాన్ని అనైతికతం, చట్టవిరుద్ధం అని పేర్కొన్నారు. మమతా బెనర్జీ చేసిన ఈ వ్యాఖ్యలతో రాహుల్ గాంధీ పూర్తిగా ఏకీభవించారు. "ఎన్నికల కమిషన్ మద్దతులో బీజేపీ అసోం, బంగాల్? ఎన్నికలను చోరీ చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మేము మమతా బెనర్జీతో ఏకీభవిస్తున్నాం. బంగాల్?లో 100 కంటే ఎక్కువ సీట్లు చోరీ అయ్యాయి" అని రాహుల్? తన ఎక్స్? పోస్టులో పేర్కొన్నారు.

కాగా, 2025 బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 206 స్థానాలను కైవసం చేసుకొని చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 77 స్థానాల్లో గెలుపొందిన ఆ పార్టీ, ఈసారి ఏకంగా బంగాల్?లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించడం విశేషం. మరోవైపు గత ఎన్నికల్లో 212 స్థానాల్లో ఘనవిజయం సాధించిన టీఎంసీ, ఈసారి కేవలం 80 స్థానాలకే పరిమితమై రెండు స్థానానికి పడిపోయింది. కాంగ్రెస్ పార్టీ కేవలం 2 సీట్లకే పరిమితమైంది. గతమెంతో ఘనకీర్తి కలిగిన లెఫ్ట్ ఫ్రంట్ కూడా కేవలం 2 స్థానాలతో సరిపెట్టుకుంది. మరో ఇద్దరు స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. దీనితో బంగాల్?లో బీజేపీకి తిరుగులేని విజయం దక్కింది. ఈ గెలుపుపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. తమ పార్టీ వ్యవస్థాపకుడైన డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ కల ఇన్నేళ్లకు నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. బీజేపీ దృష్టిలో ఈ విజయం రాజకీయాలకు అతీతమైనదని, రాష్ట్రాన్ని సురక్షితంగా, సుభిక్షంగా ఉంచాలనే తమ వ్యవస్థాపకుడి ఆశయమని అన్నారు. అందుకే బంగాల్ ఉన్నతికి తమ పార్టీ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## విశాఖ కేంద్రంగా కొత్త రైల్వేజోన్

- ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది
- సీఎం చంద్రబాబు

**టి మీడియా, మే 5 , ఢిల్లీ బ్యూరో :**

సాగర తీర నగరమైన విశాఖ కేంద్రంగా కొత్త రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతో దోహదం చేస్తుందని నేతలు సంబరపడుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడి తమ బిడ్డల భవిష్యత్ బాగుంటుందని స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్ విడుదలకు సహకరించిన ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం అవుతాయన్నారు.

**ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి దోహదం**

వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రాన్ని మారుస్తుందని అభిప్రాయపడ్డారు. నూతనంగా ఏర్పాటైన విశాఖ డివిజన్, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ జోన్ దోహదపడుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.



**విశాఖ డివిజన్‌లో విలీనం**

గుంతకల్లు డివిజన్ నుంచి "రాయచూర్ - వాడి సెక్షన్" సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అయింది. రాయగడ నుంచి కొన్ని సెక్షన్లను విశాఖ డివిజన్?లో కలుపుతూ ఉత్తర్వులు విడుదల చేసింది. తాజా

మిగతా 3లో..




# అల్లూరి జిల్లాలో విషాదం

- భారీ వృక్షం కూలి

ముగ్గురు మహిళలు మృతి

**టీ మీడియా, మే 5, అల్లూరి :**

సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో కురిసిన వర్షాలు జనాలను ఇక్కట్లకు గురి చేశాయి. అంతేకాకుండా భారీ స్థాయిలో ఈదురు గాలులు కూడా వీచాయి. దీంతో అల్లూరి జిల్లాలో తీవ్రమైన గాలులు రావడంతో ఓ భారీ వృక్షం విరిగిపడిన కారణంగా ముగ్గురు మహిళలు మృతి చెందారు. అంతేకాకుండా పిడుగుపడి 13 ఏళ్ల బాలిక మృతి చెందడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి .



**చెట్టుపడి ముగ్గురు మహిళల మరణం**

పెదబయలు మండలంలో ప్రతి సోమవారం వారపు సంత జరుగుతుంది. సోమవారం మధ్యాహ్నం, భారీ వర్షాలతో పాటు బలమైన గాలులు ఆ ప్రాంతాన్ని అతలాకుతలం చేశాయి. ఈ బలమైన గాలుల ధాటికి, సమీపంలో ఉన్న ఒక భారీ వృక్షం వేళ్లతో సహా పెకిలించుకువచ్చి, అక్కడ గుమిగూడిన చిరు వ్యాపారులపై కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మరణించగా, మరొక మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వారిని కోడ చిలకమ్మ, కొర్ర చిట్టమ్మ , పంపా మణిమగగా గుర్తించారు. వీరందరూ ఒడిశా రాష్ట్రానికి చెందినవారు. డుంబ్రిగూడ మండలంలోని సిందెరిగూడ గ్రామంలో పిడుగుపాటుకు గురై 13 ఏళ్ల బాలిక మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ బాలిక ప్రాణాలు కోల్పోవడం స్థానిక నివాసితులను తీవ్ర మనస్తాపానికి గురి చేసింది.

**విద్యుత్ సరఫరాకు అంతరాయం**

అద్దంకి నియోజకవర్గంలో కూడా భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. భయానకమైన శబ్దాలతో పిడుగులు పడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వర్షం తీవ్రత దృష్ట్యా అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పర్చూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గాలులతో కూడిన వర్షాలు కురిశాయి. సాయిబాబా ఆలయం సమీపంలో ఒక భారీ వృక్షం కూలి దుకాణం పై పడగా, పెద్దివారిపాలెంలో ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభం కూలిపోయింది. ఒక ఇంటి పైకప్పు గాలుల ధాటికి ఎగిరిపోయింది. పెద్దివారిపాలెం, కొల్లవారిపాలెం గ్రామాల్లో బలమైన గాలుల కారణంగా 30 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలులు, పిడుగుల కారణంగా దర్శి నియోజకవర్గం అంతటా విద్యుత్ అంతరాయాలు ఏర్పడినట్లు సమాచారం.

**వాహనాల రాకపోకలకు అంతరాయం**

నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చాగనం సమీపంలో ఒక చెట్టు రోడ్డు పైకి కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సైదాపురం--రాపూరు మార్గంలో కూడా వాహనాల రాకపోకలు సుదీర్ఘ సమయం పాటు నిలిచిపోయాయి. కావలిలో తీవ్రమైన పిడుగుల ప్రభావం, బలమైన గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడింది.

# పిలిప్పీన్స్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

- కళ్యాణదుర్గంలో 10 మంది అరెస్ట్

**టీ మీడియా, మే 5, కళ్యాణదుర్గం :**

ఈ రోజుల్లో సోషల్ మీడియాపై మక్కువ, ఆన్‌లైన్ గేమ్‌ల వ్యసనం యువతను పక్కదారి పట్టిస్తోంది. డబ్బు సంపాదన ఈజీ అంటూ వచ్చే యాప్‌లు, లింకులు, బెట్టింగ్?ల వలలు జీవితాలను నాశనం చేస్తున్నాయి. క్రికెట్‌పై ఉన్న మక్కువను ఆసరాగా చేసుకొని దేశవ్యాప్తంగా యువతను దోచుకుంటున్న అంతర్జాతీయ ముఠా గుట్టును అనంతపురం పోలీసులు రట్టు చేశారు. పిలిప్పీన్స్ కేంద్రంగా నడుస్తున్న ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాకు కళ్యాణదుర్గంలో ఏజెంట్ దొరికిపోవడంతో తీగ లాగితే డొంకంతా కదిలింది. పిలిప్పీన్స్ కేంద్రంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ ముఠా గుట్టును అనంతపురం పోలీసులు రట్టు చేశారు. క్రికెట్‌పై మక్కువ ఉన్న యువతను లక్ష్యంగా చేసుకొని బెట్టింగ్‌లకు ప్రోత్సహిస్తూ లక్షలు దండుకుంటున్న ఈ ముఠా బాగోతం కళ్యాణదుర్గంలో బయటపడింది. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఏజెంట్లను నియమించుకొని వారి ద్వారా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కళ్యాణదుర్గానికి చెందిన తలారి మధు ఈ ముఠా కోసం పని చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తీగ లాగితే డొంక కదిలినట్లు విచారణలో ఈ దందా మూలాలు పిలిప్పీన్స్ వరకు ఉన్నట్లు వెల్లడైంది.



**12 మంది వివరాలు వెల్లడి - 10 మంది అరెస్ట్**

తలారి మధును విచారించగా ఈ ముఠా కోసం పని చేస్తున్న 12 మంది వివరాలను వెల్లడించాడు. వారిలో 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పిలిప్పీన్స్‌లో ఉన్న శివ, కర్ణాటకకు చెందిన సచిన్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వీరిలో శివ కీలక నిందితుడు కావడంతో అతడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు.

**రూ.19.70 లక్షలు స్వాధీనం**

అరెస్టయిన 10 మంది నిందితుల నుంచి రూ.19.70 లక్షల నగదు, 4 ద్విచక్ర వాహనాలు, 3 ల్యాప్‌టాప్‌లు, 15 సిమ్ కార్డులు, 4 చెక్ బుక్కులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ పి.జగదీష్ మీడియా సమావేశంలో వెల్లడించారు. నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

# మురుగు కూపంగా మారిన ప్రధాన రహదారి

- ఎలకుర్తి శేరిపల్లి ప్రజల నరకయాతన

**టీ మీడియా, మే5 ,టేక్మాల్:**

టేక్మాల్ మండల పరిధిలోని ఎలకుర్తి శేరిపల్లి గ్రామ ప్రధాన రహదారి ప్రస్తుతం మురుగు కాలువను తలపిస్తోంది. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామస్తుల జీవనం తీవ్రంగా ప్రభావితమవుతోంది. రోడ్డుపై పొంగిపొర్లుతున్న మురుగు నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిపై మురుగు నీరు నిలిచిపోవడంతో చుట్టుపక్కల ప్రాంతమంతా దుర్వాసనతో నిండిపోయింది. బాటసారులు, స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటి కారణంగా దోమలు విస్తరిస్తూ, అంటువ్యాధుల ముప్పు పెరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఈ సమస్యపై గ్రామ సభలో పలుమార్లు చర్చలు జరిపి తీర్మానాలు చేసినప్పటికీ, అమలు మాత్రం జరగలేదు. వార్డు సభ్యులు పలుమార్లు అధికారులకు లిఖితపూర్వకంగా వినతిపత్రాలు ఇచ్చినా స్పందన రాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పన్నులు కడుతున్నాం... సౌకర్యాలేవి?**

ప్రతి ఏడాది పన్నులు వసూలు చేసే విషయంలో చూపించే శ్రద్ధ, కనీస సౌకర్యాల కల్పనలో ఎందుకు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమిస్తుందని హెచ్చరిస్తూ, వెంటనే చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు

**టి మీడియా , మే 5 ,జహీరాబాద్ :**

మహారాష్ట్రలోని తుల్జా భవాని అమ్మవారి దర్శనం నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా టాటా ఏసీ వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పరిధిలోని పస్తాపూర్ గ్రామ శివారులోని 65వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. జహీరాబాద్ పట్టణ ఎస్సై వినయ్ కుమార్ కథనం ప్రకారం... స్థానిక పట్టణ పరిధిలోని పస్తాపూర్ గ్రామ శివారులోని హైదరాబాద్ ముంబై 65వ జాతీయ రహదారిపై



ఓవర్ లోడ్‌తో ఉన్న ట్రక్కు వెనక్కి వస్తూ.. టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టింది. అదే సమయంలో మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వస్తున్న కారు సైతం టాటా ఏస్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న కాసుల మహేశ్ గౌడ్ (26), రోహిత్(16) అక్కడికక్కడే మరణించారు. నర్సింహులు (32), కార్తీక్(27) సాయి(9) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి తెలుసుకున్న వెంటనే జహీరాబాద్ పట్టణ పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, వీరంతా చేవెళ్ల ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు.

## గంగమ్మ తల్లికి మండల పూజలు

**టీ మీడియా , మే 5,పెబ్బేరు:**



పెబ్బేరు పట్టణంలో కొలువైన గంగమ్మ తల్లి ప్రతిష్టాపన జరిగి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అమ్మవారి ఆలయంలో మండల పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మత్స్యకార సహకార సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి ఆలయంలో గణపతి పూజ నవగ్రహ పూజ అభిషేకాలు హోమం మహా మంగళహారతి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు చింతకాయల కురుమూర్తి భీముడు మహేష్ కె బాలస్వామి తిరుపతయ్య కర్రెన్న మన్యం శివ దేవి ప్రసాద్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి

**టీ మీడియా , మే 5,పెబ్బేరు :**



పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు టీఎన్ ఎల్లారెడ్డి మాతృమూర్తి కీ శే టి ఎన్ శరణమ్మ అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిన మంగళవారం మాజీ తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కంచిరావుపల్లి గ్రామంలో నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు ..కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెంట వనపర్తి జిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి, ఎద్దుల సాయినాథ్ రామకృష్ణారెడ్డి, మన్యం గిరి, రాములు, మహమ్మద్ ఉన్నారు.

## బొడ్మట్ పల్లిలో జాతర బండ్ల ఉరేగింపు

**ఈ మీడియా, మే 5 ,టేక్మాల్ :**



టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్ పల్లి గ్రామంలో శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించబడుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జాతర బండ్ల ఉరేగింపు భక్తి శ్రద్ధలతో జరిగింది. ఉత్సవాల సందర్భంగా వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు “ఓం నమఃశివాయ”, “హర హర మహాదేవ” అంటూ శివనామస్మరణలో నిమగ్నమయ్యారు. అర్చనలు, అభిషేకాలు, ఇతర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వర్గానికి చెందిన ప్రజలు ఐక్యంగా పాల్గొని, తమ తమ బండ్లను అందంగా అలంకరించి జాతరలో ప్రదర్శించారు. ఆటలు, పాటలతో ఉత్సాహభరిత వాతావరణంలో గుట్ట చుట్టూ బండ్ల ఉరేగింపు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతరలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్, గ్రామ సర్పంచ్ అవినాష్ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేపట్టారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శాంతియుత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

- అదనపు ఎస్పీ రాజేష్ మీనా

**టీ మీడియా, మే 5, వనపర్తి బ్యూరో:**



మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వనపర్తి జిల్లాలో బక్రీద్ పండుగను సోదర భావంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా పిలుపునిచ్చారు. బక్రీద్ పండుగ సందర్భంగా మంగళవారం వనపర్తి డిఎస్పీ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగను పరస్పర మతాలను గౌరవిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా పరిధిలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వాహనాలకు సరైన పత్రాలు ఉన్నప్పుడే అనుమతిస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగే అక్రమ రవాణాపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటారని, సామరస్యపూర్వకంగా పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పీ గిరిబాబు, సీఐ సుగంధ రత్నం, ఎస్సై హరిప్రసాద్, ముస్లిం మత పెద్దలు, యువకులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్యుమెంట్స్ ఫోర్జరీ చేసి రుణాలు

**వెలుగులోకి మోహన్ గ్యాంగ్ అక్రమాలు**

**టీ మీడియా, మే 5, అమరావతి :**

పత్రాలను ఫోర్జరీ చేసి ఒక కంపెనీ పేరుతో రుణాలు పొందిన ‘మోహన్ గ్యాంగ్’ మోసపూరిత కార్యకలాపాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. వారు రాజ్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన అసలైన జీఎస్టీ నంబర్‌ను సంపాదించారు. అయితే వారు తమ సొంత పేరు మీద ఒక ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరిచి, దానిని కంపెనీ వివరాలతో అనుసంధానించి అనేక రుణాలను పొందారు. అంతేకాకుండా వారు ఎంఎస్ఎంఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను కూడా ఫోర్జరీ చేశారు. చివరికి వారు అసలు సంస్థ బ్యాంకు స్టేట్‌మెంట్‌ల కాపీలను ఫోర్జరీ చేసి సమర్పించే వరకు వెళ్లారు. మోహన్ గ్యాంగ్ మోసపూరిత పథకాలకు సంబంధించిన అనేక కీలక వివరాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి.




**మోసానికి గల కారణాలు ఏమిటి**

వస్త్ర వ్యాపారంలో ఎదురుదెబ్బలు ఎదుర్కొన్న మోహన్, ఆర్థిక స్థిరత్వాన్ని తిరిగి పొందే ప్రయత్నంలో అక్రమ మార్గాలను ఆశ్రయించాడు. ఫిర్యాదిదారు మధుసూదన్ రావు రాజ్ ఎంటర్‌ప్రైజెస్‌కు యజమాని. ఆ సంస్థకు కేవలం ఒకే ఒక్క క్యాష్ క్రెడిట్ లోన్ ఖాతా ఉండేది. వ్యాపార రుణాల కోసం ఇప్పటికే ఉన్న ఈ ఖాతాను ఉపయోగించడం వల్ల నిధులు అందులో జమ అవుతాయని నమ్మిన మోహన్, ఒక పథకాన్ని రూపొందించాడు. అతను రాజ్ ఎంటర్‌ప్రైజెస్ పేరు మీద తన ఉద్యోగి పసుపులేటి మణికంఠ పేరు మీద ఒక కరెంట్ ఖాతాను తెరిచి, దానిని తన మోసాన్ని అమలు చేయడానికి ఉపయోగించాడు.

**వివిధ ఆర్థిక సంస్థల నుంచి రూ.60 లక్షలు**

వారు కంపెనీ భాగస్వామ్య పత్రాన్ని సంపాదించి అందులో తమ పేర్లను చేర్చి ఫోర్జరీ చేశారు. అంతేకాకుండా తమ వాదనలకు విశ్వసనీయతను చేకూర్చడానికి రాజ్ ఎంటర్‌ప్రైజెస్ సైనేజ్ ఉన్న ఒక దుకాణం ముందు ఫోటో సెషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ విధంగా వారు వివిధ ఆర్థిక సంస్థల నుంచి సుమారుగా రూ.60 లక్షల వ్యాపార రుణాలను పొందారు. నిందితులు కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఈ వ్యాపార రుణాలన్నింటినీ పొంది ఆ తర్వాత నిధులను దుర్వినియోగం చేశారు.

**సరైన ధృవీకరణ లేకుండా ఆమోదం**

రుణాల ద్వారా వచ్చిన మొత్తం డబ్బును మణికంఠ పేరు మీద తెరిచిన మోసపూరిత రాజ్ ఎంటర్‌ప్రైజెస్ ఖాతాలో జమ చేశారు. మోహన్ ఈ ఖాతాకు సంబంధించిన ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఐడి, పాస్‌వర్డ్‌ను స్వాధీనం చేసుకుని వాటిని తన సొంత అవసరాల కోసం ఉంచుకున్నాడు. నిధులు జమ అయిన వెంటనే అతను వాటిని తన వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. ఈ బదిలీలు ఇంప్స్, ఆర్టీజీఎస్, యూపీ ద్వారా జరిగాయి. అతను నకిలీ సర్టిఫికెట్లతో కరెంట్ ఖాతా తెరవడానికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ అధికారులు సరైన ధృవీకరణ చేయకుండానే ఆ దరఖాస్తును ఆమోదించారు.

**నోటీసులలో ఈ చర్యల గురించి వివరాలు**

అదేవిధంగా హెచ్‌డిబి ఫైనాన్స్, టాటా క్యాపిటల్, నియో గ్రోత్ ఫైనాన్స్, కినారా క్యాపిటల్ సంస్థలు మోసపూరిత పత్రాలు సమర్పించినప్పటికీ భారీ వ్యాపార రుణాలను మంజూరు చేశాయి. సైబర్ క్రైమ్ పోలీసులు ఈ సంస్థలకు నోటీసులు జారీ చేశారు. ఈ రుణాలను ఎవరు మంజూరు చేశారు? ఏ అర్హత ప్రాతిపదికన వాటిని ఆమోదించారు? అనే వివరాలను ఆ నోటీసులలో తెలియజేయాలని కోరారు.

**మారం మోహన్ ఎ 1గా కస్టడి**

అంతేకాకుండా ఈ ప్రక్రియకు సంబంధించిన సమస్త రికార్డులను పోలీసుల ఎదుట సమర్పించాలని వారు సంబంధిత సంస్థలను ఆదేశించారు. రుణ మోసపు కుట్రకు ప్రధాన సూత్రధారి అయిన మారం మోహన్ ( ఎ 1)ను తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు ఒక పిటిషన్‌ను దాఖలు చేశారు. నిందితుడి నుంచి మోసపూరిత కార్యకలాపాలకు సంబంధించిన మరిన్ని వివరాలను రాబట్టాల్సిన అవసరం ఉందని ఆ పిటిషన్‌లో పేర్కొంటూ ఈ క్రమంలో అతన్ని మూడు రోజుల పాటు విచారించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ అంశం మంగళవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## మంత్రి లోకేశ్ ఫొటోతో వృద్ధ జంట నిరసన

- ఎమ్మార్వో కార్యాలయం ఎదుట వృద్ధ దంపతుల ధర్నా

**టి మీడియా , మే 5 ,జి.కొండూరు :**



భూ వివాదాలతో రాష్ట్రంలో ఎందరో బాధితులు రోడ్డెక్కిన ఘటనలు కోకొల్లలు. ఇప్పుడు ఆ జాబితాలో జి.కొండూరు వృద్ధ దంపతులు చేరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన పీజీఆర్ఎస్‌లో ఐదు నెలలుగా మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా న్యాయం దక్కలేదు. వ్యవస్థపై విశ్వాసం సడలిన ఓ వృద్ధ జంట మంగళవారం జి.కొండూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట మంత్రి లోకేశ్ ఫొటోతో నిరసనకు దిగింది. కాళ్లు అరిగేలా తిరిగాం: భూ వివాదం పరిష్కరించాలని కోరుతూ కుంటముక్కల గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు మంగళవారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. మంత్రి నారా లోకేశ్ ఫొటోతో కార్యాలయం ఎదుట బైఠాయించి తమ ఆవేదనను వెలిబుచ్చారు. భూ వివాదం విషయంలో కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని వారు వాపోయారు.

**న్యాయం చెయ్యండి** గత 5 నెలలుగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌లో సమస్యను విన్నవించుకుంటున్నా అధికారులు ఎటువంటి పరిష్కారం చూపడం లేదని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ విషయంలో మంత్రి నారా లోకేశ్ స్పందించి తమకు న్యాయం చేయాలని వృద్ధ దంపతులు కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

**టి మీడియా , మే 5 , యాదాద్రి భువనగిరి :**



ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చేతికొచ్చిన పంట కండ్ల ముందే వర్షార్పణం అవుతుంటే కడుపుమండిన రైతులు రోడ్లపై కొచ్చి ఆందోళనలు చేపడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



## ఒక్క ఓటుతో టీవీకే నేత విజయం

- క్యాబినెట్ మినిస్టర్‌కు షాక్
- గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన విజయ్

**టి మీడియా , మే 5 , చెన్నై :**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కజగం (టీవీకే) అనూహ్య విజయాన్ని సాధించింది. ఏకంగా డీఎంకే అధిపతి, సీఎం స్టాలిన్?ను తన నియోజకవర్గంలోనే ఓడించారు. అయితే ఈ ఎన్నికల్లో ఓ అరుదైన సంఘటన జరిగింది. ఒక్క ఓటు విలువ ఎంతో చూపించింది. టీవీకే అభ్యర్థికి ఒక్క ఓటు తేడాలో డీఎంకే క్యాబినెట్? మినిస్టర్?ను ఓడించారు. మరోవైపు మ్యాజిక్? ఫిగర్? దాటకపోయినా, ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించడానికి టీవీకే అధినేత విజయ్, గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సమాచారం. ఈ మేరకు ఒక లేఖ రాసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**ఒక్క ఓటుతో ఓటమి**

మే 4న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో తిరుపత్తూరు నియోజవర్గంలో డీఎంకే మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ కేవలం ఒక్క ఓటు తేడాతో ఓటమి పాలయ్యారు. డీఎంకేకు చెందిన సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్‌పై టీవీకే అభ్యర్థి శ్రీనివాస సేతుపతి ఆర్ విజయం సాధించారు. సేతుపతి మొత్తం 83,375 ఓట్లు సాధించగా, పెరియకరుప్పన్ ఒక్క ఓటు తేడాతో వెనుకబడ్డారు. ఇంత తక్కువ తేడాతో ఓటమి లేదా విజయం సాధించడం ఎన్నికల చరిత్రలో అరుదుగా కనిపించే విషయం. ఈ ఫలితం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ప్రాముఖ్యత ఎంత ఉంటుందో ఇది స్పష్టంగా చూపించింది.

# తెలంగాణలో సీఎంఆర్ఎఫ్ నిబంధనలు కఠినం

- ఇకపై మంత్రుల సిఫార్సులు చెల్లవు

**టి మీడియా , మే 5 , హైదరాబాద్ బ్యూరో :**

ఆపదలో ఉన్న పేదలు, విపత్తు బాధితులకు తక్షణం ఆర్థిక సహాయం అందించే ముఖ్యమంత్రి సహాయనిధి పథకంలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమైన మార్పులు చేసింది. నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకుని, పారదర్శకతను పెంపొందించడం, నిజమైన లబ్ధిదారులకు మాత్రమే సహాయం చేరేలా చూడటం లక్ష్యంగా నిబంధనలను కఠినతరం చేసినట్లు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త ఉత్తర్వుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయి అధికారులు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసే కసరత్తు ప్రారంభించారు.

**చెక్కుల సవరణ పూర్తిగా డిజిటల్**

గతంలో సీఎంఆర్ఎఫ్‌లో అనర్హులు, రాజకీయ ప్రాతిపదికపై సిఫార్సులు, చెక్కుల్లో తప్పులు వంటి సమస్యలు ఎక్కువగా వ్యక్తమయ్యాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వ్యవస్థాగత మార్పులు తీసుకొచ్చింది.

**చెక్కుల సవరణ పూర్తిగా ఆన్‌లైన్**

సీఎంఆర్ఎఫ్ చెక్కుల్లో పేరు, మొత్తం లేదా ఇతర వివరాల్లో తప్పులు దొర్లితే గతంలో మాన్యువల్ పద్ధతిలో సవరణ చేసేవారు. ఇకపై ఈ ప్రక్రియను పూర్తిగా డిజిటల్ చేశారు.

నియోజకవర్గ చిరునామా ఉన్న అభ్యర్థులకు మాత్రమే లబ్ధిదారులు తమ నియోజకవర్గ ప్రజాప్రతినిధి కార్యాలయాన్ని సంప్రదించాలి. అక్కడి సిబ్బంది ప్రజాప్రతినిధి లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో రెవెన్యూ విభాగానికి దరఖాస్తు పంపిస్తారు. తర్వాత కొత్త చెక్కు నేరుగా ఆ ఎమ్మెల్యే కార్యాలయానికే వస్తుంది. ఈ మార్పు వల్ల మధ్యలో జోక్యాలు, ఆలస్యాలు తగ్గుతాయని అధికారులు ఆశిస్తున్నారు.



**సిఫార్సులకు కొత్త షరతు**

ఇప్పటివరకు మంత్రులు, ఎమ్మెల్యేలు ఏ నియోజకవర్గం నుంచైనా సిఫార్సు చేసే అవకాశం ఉండేది. కొత్త ఉత్తర్వు ప్రకారం తమ నియోజకవర్గ పరిధిలో నివసించే వారి చిరునామా ఉన్న అభ్యర్థులకు మాత్రమే సిఫార్సు చేయాల్సి ఉంటుంది.ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లోనూ అభ్యర్థి చిరునామా ఆధారంగానే సిఫార్సు వ్యవస్థను మార్చారు. ఈ మార్పు వల్ల రాజకీయ ప్రయోజనాల కోసం అనర్హులు సహాయం పొందే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**వివరాలు పక్కాగా ఉండాలి**

దరఖాస్తుదారులు ఇచ్చే వివరాల్లో తప్పులు దొర్లితే ఆర్థిక సహాయం అందడంలో జాప్యం జరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యంగా చరవాణి నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ నంబరు తప్పుగా ఇవ్వడం, వాస్తవ ధ్రువపత్రాలు అంటే ఆదాయ ధృవీకరణ, కుటుంబ సభ్యుల వివరాలు మొదలైనవి సకాలంలో సమర్పించకపోవడం వంటి తప్పుల వల్ల చెక్కులు ఆలస్యమవుతున్నాయని గుర్తించింది.

అందువల్ల అన్ని వివరాలు సరిగ్గా, పూర్తిగా ఉండేలా జాగ్రత్త వహించాలని ప్రభుత్వం లబ్ధిదారులు, సిబ్బందికి సూచించింది. ఈ కొత్త నిబంధనలు సీఎంఆర్ఎఫ్ పథకాన్ని మరింత బలోపేతం చేసి, నిజంగా సహాయం అవసరమైన పేదలు, విపత్తు బాధితులకు త్వరగా, పారదర్శకంగా ఆర్థిక సహాయం అందించడానికి ఉపయోగపడతాయని అధికారులు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ మార్పుల అమలు కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

**రెండు రకాలుగా సాయం**

'సీఎంఆర్?ఎఫ్' సాయాన్ని రెండు రకాలుగా ప్రభుత్వం ఇస్తోంది. నిమ్స్, ఎంఎన్?జే క్యాన్సర్ హాస్పిటల్, ఈఎన్?టీ ఆసుపత్రుల్లో చికిత్స కోసం ముందుగా చెల్లింపులు అవసరం లేకుండా ప్రభుత్వం లేఖను ఇస్తోంది. ఈ లేఖలో మంజూరు చేసిన నగదును చెల్లించకుండానే రోగి చికిత్స పొందవచ్చు. ఇలా గత రెండేళ్లలో 27,421 మందికి రూ.533.69 కోట్లను మంజూరు చేశారు. ఇక ఏదైనా ప్రభుత్వం లేదా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన రోగి బిల్లు మొత్తం చెల్లించిన తర్వాత అందులో కొంతభాగాన్ని తిరిగి ఇవ్వాలని ఈ నిధికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ రకంగా రీయింబర్స్?మెంట్ కింద 3,48,952 మందికి రూ.1,152.10 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

**ఈ సీఎంఆర్ఆఫ్ ఫండ్ అప్లై చేయడానికి కావాలసిన పత్రాలు**

ఆధార్ కార్డు, రేషన్ కార్డు,ఒరిజినల్ మెడికల్ బిల్లులు, హాస్పిటల్ డిశ్చార్జ్ సమ్మరీ, చికిత్స అంచనా పేపర్స్,లబ్ధిదారుని బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్. మీ నియోజకవర్గ ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ సంతకం చేసిన సిఫార్సు లేఖ తప్పనిసరిగా ఉండాలి.ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికేట్, ఫొటో, ఫోన్ నెంబర్ మీకు ఏదైనా సహాయం అవసరమైన, వివరాలు తెలుసుకోవాలన్నా కింది నెంబర్?ను సంప్రదించవచ్చు :040-23455662, 7995733002, ఈ-మెయిల్: cmrftg1@gmail.com.

## విశాఖ కేంద్రంగా కొత్త రైల్వేజోన్

(మొదటిపేజీ తరువాయి..)

ఉత్తర్వులతో రాయగడ డివిజన్?లో ఇంతకు ముందున్న పలాస-ఇచ్ఛాపురం రైల్వే లైన్, ఇచ్ఛాపురం-దువ్వాడ-విజయనగరం లైన్?ను విశాఖ డివిజన్?లో చేరాయి. అదే విధంగా నౌపడ - పర్లాకిమిడి, బొబ్బిలి-సాలూరు లైన్?లు సింహాచలం-వడ్లపూడి, విశాఖ-జగ్గయ్యపాలెం రైల్వేలైన్లను విశాఖ డివిజన్?లో విలీనం చేశారు. కోరాపుట్-కిరండోల్ లైన్?ను విశాఖ, రాయగడ డివిజన్లకు సంయుక్తంగా కేటాయించింది. ఈ మార్పులన్నీ జూన్ 1, 2026 అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో రైల్వే బోర్డు స్పష్టం చేసింది.

**ఇవే గీటురాళ్లు** ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖ రైల్వే జోన్ గ్రోత్ ఇంజిన్‌లా మారుతుందని నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైళ్ల సంఖ్య పెరిగి కనెక్టివిటీ మెరుగుపడుతుందని చెప్పారు. ఇచ్ఛాపురం, పలాస సెక్షన్‌ను విశాఖ డివిజన్‌కు బదిలీ చెయ్యడంలో ప్రభుత్వం చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు.ఇటీవల అమరావతికి చట్టబద్ధత, నేడు విశాఖ రైల్వే జోన్‌కు గెజిట్? వచ్చిందని టీడీపీ నేత ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వేగవంతమైన పాలనకు ఇవే గీటురాళ్లని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ హబ్ చేయాలన్న సీఎం ఆలోచనకు తొలి అడుగు పడిందన్నారు. వచ్చే నెల 1 నుంచి విశాఖ రైల్వే జోన్ అమల్లోకి వస్తుందన్న ప్రత్తిపాటి ఈ జోన్‌తో పారిశ్రామిక అభివృద్ధికి మార్గం సుగమమవుతుందన్నారు. కొత్త రైల్వే జోన్ పరిధిలో 74 స్టేషన్లు ఆధునికీకరణ, 1,039 కి.మీ. మేర కొత్త లైన్ ఏర్పాటు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధాన పోర్టులు, పారిశ్రామిక హబ్‌లు కలుపుతూ రైల్వే లైన్ వస్తుందని ప్రత్తిపాటి వివరించారు.రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదలపై ఉత్తరాంధ్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదు

(మొదటిపేజీ తరువాయి..)

తాను ఇండియా కూటమిని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని వ్యాఖ్యానించారు.

**ఈసీతో పోరాడాం'**

అయితే, ఈ ఎన్నికల్లో టీఎంసీ పోటీ బీజేపీకి వ్యతిరేకంగా కాదని, ఆ పార్టీ కోసం పనిచేసిన ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగానేనని మమత ఆరోపించారు. ఇకపై ఈసీపై ఎలా పోరాడాలో పార్టీలో చర్చించి, ముందుకెళ్తామని చెప్పారు. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల్లో పౌరుల ప్రజాస్వామ్య హక్కులను, ఈవీఎంలను లూటీ చేయడానికి సీఈసీ విలన్‌గా మారారని మమత ఆరోపించారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత కూడా ఈవీఎంలలో 80-90 శాతం ఛార్జింగ్ ఎలా ఉంటుంది? ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మట్నదటి రౌండ్ కౌంటింగ్ పూర్తయ్యాక బీజేపీకి 195-200 సీట్లు రాబోతున్నాయని ఎలా చెప్పారన్నారు.అదేవిధంగా, కౌంటింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న గందరగోళాన్ని కూడా మమత వివరించారు. ఐదు రౌండ్లు మిగిలి ఉండగా తాను 30,000 ఓట్ల ఆధిక్యంలో ఉన్నప్పుడు, బీజేపీ అభ్యర్థులు 200 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది, 200 మంది బయటి గూండాలతో ప్రాంగణంలోకి ప్రవేశించారని ఆమె పేర్కొన్నారు. వెంటనే బీజేపీ నాయకులు కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లి కౌంటింగ్ ఏజెంట్లను కొట్టడం ప్రారంభించారని ఆమె చెప్పారు. తాను కొన్ని నిమిషాలు కౌంటింగ్ కేంద్రంలో ఉన్నానని, ఆ సమయంలో కడుపు, వెనక భాగంలో కొట్టారని ఆరోపించారు. అంతేకాదు, తన పట్ల దురుసుగా ప్రవర్తించారన్నారు. అయితే, ఆ సమయంలో సీసీటీవీని ఆఫ్ చేశారని తెలిపారు.మరోవైపు, ఎన్నికల సమయంలో బంగాల్ పోలీసులు అచేతనంగా ఉండిపోయారని ఆమె వ్యాఖ్యానించారు. కేంద్రబలగాలు కూడా ఈసీతో కుమ్మక్కై కౌంటింగ్ కేంద్రాల్లో తమ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. మహిళనైన తనతోనే అనుచితంగా ప్రవర్తించారని మండిపడ్డారు. ఎన్నికల ఫలితాల అనంతరం, తమ పార్టీ కార్యాలయాలపైనా దాడులు చేస్తున్నారని మమత తెలిపారు. అయితే, హింసతో ప్రభావితమైన ప్రాంతాలను సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేయడానికి 10 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తామని మమత పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 206 స్థానాలు గెలుచుకుని, రాష్ట్రంలో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసుకుంది. అంతేకాదు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుచుకున్న 77 స్థానాల సంఖ్యను ఆ పార్టీ అధిగమించింది. మరోవైపు, గత అసెంబ్లీ ఎన్నికల్లో 212 సీట్లు గెలుచుకుని ఘనవిజయం సాధించిన తృణమూల్ కాంగ్రెస్, ఈసారి 80 సీట్లతో వెనుకబడి రెండో స్థానానికి పరిమితమైంది.

## సీఎం పదవికి స్టాలిన్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి..)

బలమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. డిఎంకె కూటమికి మద్దతు తెలిపిన తమిళనాడు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఓటును అమూల్యమైన విశ్వాస చిహ్నంగా పరిగణిస్తూ ఆయన ఓటర్లకు ధన్యవాదాలు చెప్పారు. డిఎంకె కూటమి 1.54 కోట్లకు పైగా ఓట్లను సాధించిందని, గెలుపొందిన పార్టీతో పోలిస్తే కేవలం 3.52 శాతం ఓట్ల స్వల్ప తేడా మాత్రమే ఉందని ఆయన వివరించారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నట్లు స్టాలిన్ తెలిపారు.

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా డిఎంకె ప్రజలకు సేవ చేస్తోందని డీఎంకే అధినేత స్టాలిన్ చెప్పారు. డిఎంకె ఆరుసార్లు అధికారంలో ఉంది. మేము చూడని విజయం లేదు. మేము ఎదుర్కోని ఓటమి లేదు. రాజకీయ ప్రజా జీవితంలోనూ, మా సిద్ధాంతాన్ని నిలబెట్టుకునే ప్రయాణంలోనూ మేము ఎల్లప్పుడూ జాగ్రత్త వహించే విషయం ఏమిటంటే మా సిద్ధాంతం ఎప్పటికీ ఓటమి పాలు కాకూడదు. విజయం వచ్చినా, ఓటమి ఎదురైనా వాటిని సమానంగా భావిస్తూ తమ ఆదర్శాల దిశగా మా కార్యకర్తలు ప్రయాణాన్ని కొనసాగిస్తారు. అందుకే నేను ముఖ్యమైన సదస్సుల్లోనూ, బహిరంగ సభల్లోనూ మాట్లాడినప్పుడల్లా, తమిళనాడు నలుమూలల ఉన్న కార్యకర్తలందరిని గుర్తిస్తూనే నా ప్రసంగాన్ని ప్రారంభిస్తాను. మీరే ఈ ఉద్యమానికి ప్రాణశక్తి, మూలాధారం. మేము అధికార పక్షంలో ఉంటే ప్రజల కోసం సంక్షేమ పథకాలను రూపొందిస్తాము. మేము ప్రతిపక్షంలో ఉంటే ప్రజల డిమాండ్ల సాధన కోసం పోరాడుతాం. ఈ క్రమంలోనే ఇప్పుడు ఒక బలమైన ప్రతిపక్ష పార్టీగా ప్రజల కోసమే మా రాజకీయాలను కొనసాగిస్తాం" అని స్టాలిన్? అన్నారు.

**8,795 ఓట్ల తేడాతో ఓడిపోయిన స్టాలిన్?**

కాగా, ఈ ఎన్నికల్లో కొళత్తూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన స్టాలిన్? ఓటమి పాలయ్యారు. టి వి కె అభ్యర్థి వి.ఎస్. బాబు చేతిలో 8,795 ఓట్ల తేడాతో ఓడిపోయారు. టీవీకే 32 శాతానికి పైగా ఓట్లు సాధించగా, డిఎంకె 24.19 శాతం, ఏఐఏడీఎంకే 21.22 శాతం ఓట్లను సాధించాయి. తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో డీఎంకే పార్టీ 59 సీట్లకే పరిమితమైంది. 108 స్థానాల్లో గెలుపొంది విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీకి ఇంకా 10 స్థానాల దూరంలోనే ఉండిపోయింది.

## రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి పొంగులేటి

**టి మీడియా , మే 5 , హనుమకొండ :**



సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాతి ప్రభుత్వం నడుస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. వారు(బీఆర్ఎస్) రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21 వేల కోట్లు చెల్లించామన్న ఆయన వరి వేసిన రైతులకు మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. హనుమకొండలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**నాలుగు రోజుల్లో రైతుల సమస్యలు పరిష్కరిస్తాం**

గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారని, తాము మాత్రం రైతును రాజు చేసే వరకు విశ్రమించబోమని పొంగులేటి శ్రీనివాస్? రెడ్డి తెలిపారు. రైతులకు ఎకరానికి రూ.12 వేలతో పాటు వ్యవసాయ పరికరాలు ఇస్తూ, కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటుకు రూ.1200 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. మూడు, నాలుగు రోజుల్లో రైతుల సమస్యలు పరిష్కరిస్తామని, ఆ బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులు తీసుకుంటారని తెలిపారు.

**ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతన్నల ఆగ్రహం**

ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తూ ప్రభుత్వం రైతులను అరిగోసలు పెడుతుందని కేంద్ర హోంశాఖ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా తూకాలు వేయడం లేదని మండిపడ్డారు. కరీంనగర్ జిల్లా ఖాజీపూర్ వద్ద కొనుగోలు కేంద్రానికి వెళ్లిన బండి సంజయ్ రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు వస్తే ఇప్పటివరకు 15 లక్షల మెట్రిక్ టన్నులే కొన్నారని తెలిపారు. తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను అడ్డగోలుగా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. కల్లాల్లో వడ్లు పోసి కళ్లల్లో ఒత్తులేసుకొని చూస్తున్న రైతుల గోడును పట్టించుకొని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

**సిద్ధిపేట జిల్లాలో రైతుల ధర్నా**

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాల కూడలిలో ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ధర్నా చేశారు. కలెక్టర్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అటు రైతులు, ఇటు క్షేత్రస్థాయి అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. కింది స్థాయి నుంచి ఉన్నత పదవికి ఎదిగిన కలెక్టర్‌కు క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న అవస్థలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగకపోతే కర్షకులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రభాకర్? రెడ్డి హెచ్చరించారు. అధికారులకు సరైన దిశా నిర్దేశం చేయడంలో కలెక్టర్ పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. రైతన్నల కష్టార్జితానికి గిట్టుబాటు ధర లభించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# పనిమనిషి టు ఎమ్మెల్యే

- 12వేలకుపైగా ఓట్ల తేడాతో విక్టరీ

**టి మీడియా , మే 5 , ఢిల్లీ బ్యూరో :**

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ విజయఢంకా మోగించింది. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కంచుకోటను బద్దలు కొట్టింది. 15 సంవత్సరాల తృణమూల్ పాలనకు చరమగీతం పాడింది. అయితే ఈ ఎన్నికల ఫలితాల్లో అనేక సంచనాలు నమోదు అయ్యాయి. అందులో బీజేపీ నాయకురాలు కలితా మాఝీ విజయం ఒకటి. ఎందుకంటే ఇళ్లలో పనిమనిషిగా పనిచేస్తూ నెలలో కొద్దిగా వచ్చే జీతంతో జీవనం సాగిస్తున్న కలితా ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీఎంసీ అభ్యర్థిపై ఏకంగా 12వేలకుపైగా ఓట్ల తేడాతో జయకేతనం ఎగురవేశారు. ఈ క్రమంలో కలితా మాఝీ ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లేంటి? ఆమెకు మొదటిసారే విజయం వరించిందా? తదితర విషయాలు తెలుసుకుందాం.

**రెండోసారి దక్కిన విజయం**

బంగాల్‌లోని ఔస్‌గ్రామ్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా కలితా మాఝీ బరిలో దిగారు. ఆమెకు 1,07,692 ఓట్లు పడ్డాయి. తన ప్రత్యర్థి, టీఎంసీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్యామా ప్రసన్న లోహర్‌కు 95157 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో శ్యామా ప్రసన్నపై 12,535 ఓట్ల తేడాతో కలిత గెలుపొందారు. 2021లో జరిగిన బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కలిత పోటీ చేశారు. అయితే టీఎంసీ అభ్యర్థిపై 11వేలకుపైగా ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ కలితపై నమ్మకంతో ఔస్‌గ్రామ్ నుంచి మరోసారి ఆమెను బీజేపీ బరిలోకి దింపింది. ఈసారి మాత్రం కలితా మాఝీ సత్తా చాటి ఘనవిజయం సాధించారు.





**నెలకు రూ.2500 జీతం**

పూర్వ బర్ధమాన్ జిల్లాలోని గుస్కారా మున్సిపాలిటీకి చెందిన కలితా మాఝీకి ఎటువంటి రాజకీయ నేపథ్యం లేదా వారసత్వం లేదు. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆమె వద్ద తగినన్నీ ఆర్థిక వనరులు కూడా లేవు. క్రియాశీల రాజకీయాల్లోకి రాకముందు కలిత నాలుగు ఇళ్లలో పనిమనిషిగా పనిచేస్తూ నెలకు కేవలం రూ.2,500 సంపాదించేవారు. దాంతోనే కుటుంబాన్ని పోషించుకునేవారు. అటువంటి కలితా మాఝీకి బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కల్పించింది. కలిత సాధారణ జీవిత నేపథ్యం, స్థానికంగా ఉన్న బలమైన సంబంధాల కారణంగా ఎన్నికల ప్రచార సమయంలో ఆమె అభ్యర్థిత్వం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ క్రమంలో ప్రస్తుత ఎన్నికల్లో స్థానిక ప్రజల మద్దతుతో భారీ విజయాన్ని నమోదు చేశారు.

**అంత ఈజీగా గెలుపు రాలేదు**

అయితే కలితా మాఝీకి ఈ విజయం అంత సునాయాశంగా రాలేదు. ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లను స్వయంగా కలిసేందుకు ఇంటింటికీ తిరిగారు. కఠోరంగా శ్రమించారు. నేరుగా ఓటర్లతో మమేకయ్యారు. ఈ శ్రమ ఫలించి ఎన్నికల్లో విజయం సాధించారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం గానీ, ఆర్థిక అండ గానీ లేని కలితా మాఝీ ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అగ్ర నాయకులకు ఘోర పరాజయాన్ని రుచి చూపించారు. కాగా, కలిత గత దశాబ్ద కాలం నుంచి రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు. ఆమె తన రాజకీయ ప్రస్థానాన్ని బూత్ స్థాయి కార్యకర్తగా ప్రారంభించి, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.ఔస్‌గ్రామ్ నియోజకవర్గంలో కలితా మాఝీ సాధించిన విజయం ప్రజాస్వామ్యంలో సామాన్యుడి ఓటుకున్న శక్తిని నిస్సందేహంగా నిరూపించింది. కలిత గెలుపు అనేది ఎంత చిన్న స్థాయిలో ఉన్నా, ఆర్థికంగా బలంగా లేకపోయినా ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీ మెట్లు ఎక్కొచ్చనడానికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించడానికి సవాళ్లను అధిగమించి ముందుకు సాగితే కచ్చితంగా విజయం వరిస్తుందని కలితా మాఝీ నిరూపించారు.

**అలాంటి వారికి ఏకైక వేదిక బీజేపీ**

కలితా మాఝీ ఔస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడంపై బీజేపీ ఎంపీ పీసీ మోహన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విజయం బీజేపీ బలాన్ని చాటి చెబుతోందన్నారు. సామాన్య వ్యక్తి కూడా ఎదిగి ఉన్నత స్థానాలకు చేరుకోగలిగే ఏకైన వేదిక భారతీయ జనతా పార్టీ అని తెలిపారు. కలితా మాఝీది ఒక స్ఫూర్తిదాయకమైన కథని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో గెలుపొందిన కలితా మాఝీకి అభినందనలు తెలియజేశారు.

# "యువతులతో లోన్లు తీయిస్తాడు-బెట్టింగ్‌లో డబ్బులు పెట్టిస్తాడు

**నైస్‌గా మాట్లాడుతాడు - వీడిని నమ్మితే అంత**

**టి మీడియా , మే 5 , హైదరాబాద్ బ్యూరో :**

బెట్టింగ్ సరదాగా మొదలెడితే వ్యసనంగా మారుతుంది. ఒక్కసారి అలవాటైతే ఇక కథ కంచికి చేరడం ఖాయం. ఆన్?లైన్? బెట్టింగ్ వందలతో మొదలై లక్షల వరకూ ఉంటోంది. పందేల మోజులో కొందరు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. మరోవైపు ఇందులో నష్టపోయిన యువకులు మోసాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.తాజాగా ఓ యువకుడు మంచి జీతంతో కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. క్రమంగా క్రికెట్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. ఉన్న డబ్బంతా ఖర్చు చేశాడు. ఇక చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి నెలకొంది. వ్యసనాలకు డబ్బుల కోసం అనేక అడ్డదారులు తొక్కాడు.ప్రకాశం జిల్లా అద్దంకికి చెందిన యువకుడు హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్‌ఆర్ విభాగంలో ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వహించేవాడు. ఎక్కువ శాతం డబ్బును క్రికెట్ బెట్టింగ్‌ల కోసం వెచ్చించేవాడు. ఇక చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో మోసాలు చేయడం ప్రారంభించాడు. మ్యాట్రిమోనియల్, డేటింగ్ సైట్లలో యువతులను పరిచయం చేసుకునేవాడు. వారికి మాయమాటలు చెప్పి వారి చేతే లోన్లు తీయించి డబ్బులు ట్రాన్స్?ఫర్? చేయించుకునేవాడు. అంతేకాక ఉద్యోగాల పేరుతోనూ పలువురి వద్ద డబ్బులు వసూలు చేశాడు. ఆ సొమ్మంతా బెట్టింగ్‌లో పెట్టాడు. నిందితుడిపై 2018లో తొలి కేసు నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు 12 కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు దాదాపు రెండు కోట్ల వరకు మోసాలకు పాల్పడ్డాడు.వ్యాపారం కోసమని నమ్మించి : బస్సులో పరిచయమైన యువతికి నిందితుడు మాయమాటలు చెప్పాడు. వ్యాపారం చేస్తున్నానని చెప్పి ఆమెతో లోన్? కోసం అప్లై చేయించి రూ.25 లక్షలు తీసుకున్నాడు. ఇది తెలిసిన తర్వాత సాఫ్ట్‌వేర్ కంపెనీ జాబ్? నుంచి తొలగించింది. వారి అంతర్గత విచారణలో కంపెనీలో చేరిన వారిలో పలువురి నుంచి ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు తేలింది. దీంతో ఆ సంస్థ ప్రతినిధులు మాదాపూర్ స్టేషన్‌లో ఫిర్యాదులు ఇప్పించి కేసు నమోదు చేయించారు.నిందితుడు కేసులు నమోదైనా ఏమాత్రం లెక్క చేయకుండా మోసాలకు పాల్పడుతూనే ఉన్నాడు. డేటింగ్?, మ్యాట్రిమోని సైట్లలో ఎంచుకున్న యువతులకు రిక్వెస్ట్‌లు పంపించి వారి నుంచి సమాధానం వచ్చిన తర్వాత మెల్లగా మాటలు కలిపేవాడు. తనకు అనేక వ్యాపారాలు ఉన్నాయని చెప్పేవాడు. పెట్టుబడికి నగదు అవసరమని చెప్పి వారితో లోన్లు తీయించి, ఆ సొమ్మును ట్రాన్స్?ఫర్? చేయించుకునే వాడు. నౌకరీ.కామ్‌లోనూ పలువురి యువతుల ప్రొఫైల్స్ చూసి వారికి జాబ్స్?, సర్టిఫికెట్లను ఇప్పిస్తానని గాలం వేసేవాడు. ఇలా ఏకంగా ఎస్ఏపీ సర్టిఫికెట్ల పేరుతోనే సుమారు 50 మంది నుంచి డబ్బులు వసూలు చేశాడఈ సంవత్సరం మార్చిలో విజయవాడకు చెందిన యువతికి ఫోన్ చేసి ఎస్ఏపీ సర్టిఫికెట్‌ను ఇప్పిస్తానని చెప్పారు దీనికి డబ్బులు చెల్లించాలని ఫోన్‌లో సంప్రదించాడు. దీనిపై వారు గట్టిగా ప్రశ్నించేసరికి దుర్భాషలాడాడు. దీనిపై సైబర్ క్రైమ్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని విజయవాడ సైబర్ పోలీసులు వలపన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.





**సొమ్మంతా బెట్టింగ్ యాప్‌లకే**

అన్ని మోసాల్లోనూ నిందితుడు ఎక్కడా తన బ్యాంకు ఖాతాను ఉపయోగించకుండా జాగ్రత్త పడ్డాడు. పలువురి నుంచి తీసుకున్న నగదును వారితో నేరుగా సంబంధిత బెట్టింగ్ యాప్‌కే బదిలీ చేయించేవాడు. ఇందుకోసం ఆ యాప్‌లోని యూపీఐ క్యూఆర్ కోడ్‌ను పంపించి దానిని స్కాన్ చేయమని చెప్పేవాడు. ఇలా ఎక్కడా తన ప్రమేయం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నా చివరకు పోలీసులకు చిక్కాడు.

# యాక్టివ్ మోడ్‌లోకి అధికార కాంగ్రెస్

**పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రాధాన్యత**

**టి మీడియా , మే 5 , హైదరాబాద్ బ్యూరో :**



తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ యాక్టివ్? మోడ్‌లోకి వచ్చింది. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టింది. పార్టీ పరిపాలనతో పాటు రాజకీయంగా కూడా వేగం పెంచింది. జిల్లా స్థాయి నుంచి బూత్ స్థాయి కమిటీల వరకు చకచకా పూర్తి అవుతున్నాయి. రాజకీయంగా తన పునాదులను మరింత పటిష్ఠం చేసుకునే దిశలో కదులుతోంది. పార్టీ సంస్థాగత నిర్మాణం, అధికార యంత్రాంగంపై పట్టు, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం, నాయకుల మధ్య సమన్వయం లాంటి అంశాలపై ప్రత్యేక కథనం.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పార్టీ సంస్థాగత బలోపేతానికి మొదటి ప్రాధాన్యత ఇస్తోంది. ప్రస్తుతం సంస్థాగతంగా పూర్తి స్థాయి పునర్? వ్యవస్థీకరణ దిశగా అడుగులు వేస్తోంది. జిల్లా స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కమిటీల ఏర్పాటు చకచకా జరుగుతోంది. నియోజకవర్గ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠపరచే లక్ష్యంతో జిల్లా స్థాయిలో సమన్వయ సమావేశాలు నిరంతరం నిర్వహిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్? కుమార్ గౌడ్ ఇప్పటికే సగానికి పైగా జిల్లాల్లో పర్యటించి సమన్వయ సమావేశాలు నిర్వహించారు. క్షేత్రస్థాయి కేడర్‌ను పూర్తి స్థాయిలో యాక్టివేట్ చేయడం ప్రస్తుతం పార్టీ నాయకత్వం ముందున్న ప్రధాన లక్ష్యంగా మారింది. బూత్ స్థాయిలో కార్యకర్తలకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించడం, వారితో క్రమం తప్పకుండా సమీక్షలు చేయడం వంటి అంశాలు ఇప్పుడు పార్టీకి ప్రాధాన్యతగా మారాయి.

**సామాజిక వ్యూహంలో కీలక అంశాలు**

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రాధాన్యత ఇవ్వాలనే దిశలో స్పష్టమైన చర్యలు ప్రారంభించింది. నియోజకవర్గాల నాయకులతో నేరుగా సంప్రదించడం, వారి సమస్యలకు సత్వరం స్పందించి పరిష్కరించడం, వారిని పార్టీకి ముఖ్యమైన వారిగా చేర్చుకోవడం ఇవే ఇప్పుడు సామాజిక వ్యూహంలో కీలక అంశాలుగా కనిపిస్తున్నాయి. వివిధ వర్గాల నేతలను ఒకే వేదికపై నిలిపి అందరూ ఒకే దిశలో ముందుకు వెళ్లాలన్న సందేశం ఇస్తున్నారు. జిల్లా స్థాయి నేతలతో వ్యక్తిగతంగా సమావేశం అవుతూ, వారి అభిప్రాయాలను నేరుగా వినడం వంటి చర్యలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం తీసుకోవడం వల్ల పార్టీలో ఐక్యత పెరుగుతోంది. పీసీసీ అందరినీ కలుపుకుని పోవడమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తూ వస్తోంది.

**సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలు వేగవంతం**

ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవడం, పాలన వేగాన్ని పెంచడం వంటి అంశాల్లో కూడా కాంగ్రెస్ చొరవ చూపుతోంది. పార్టీ, ప్రభుత్వం రెండూ ఒకే లక్ష్యంతో ముందుకు సాగేలా సమన్వయ వ్యవస్థను పటిష్ఠం చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాఖల వారీగా సమీక్షలను వేగవంతం చేశారు. ప్రతి పథకానికి నిర్దిష్టమైన టైమ్‌లైన్ నిర్ణయించి త్వరితగతిన అమలు అయ్యేలా చొరవ చూపుతున్నారు. అమలులో ఏ మాత్రం ఆలస్యం జరిగినా వెంటనే సరిదిద్దే వ్యవస్థను ప్రభుత్వం రూపొందిస్తోంది. ఇవన్నీ ప్రస్తుత పాలనా తీరులో కనిపిస్తున్న మార్పులుగా చెప్పవచ్చు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ ఫలాలు ప్రజలకు నేరుగా అందేలా చేయాలన్న సంకల్పంతో అధికార యంత్రాంగంపై ప్రభుత్వం పట్టు బిగిస్తోంది. పథకాల అమలు తీరును సమీక్షిస్తూ అధికారులకు స్పష్టమైన లక్ష్యాలు ఇవ్వడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం ఇవే ఇప్పుడు ప్రభుత్వ ప్రాధాన్యతలుగా కనిపిస్తున్నాయి.

**విమర్శలకు తిప్పికొట్టే దిశలో కాంగ్రెస్ వ్యూహరచన**

ప్రతిపక్షాల దూకుడుకు కళ్లెం వేయడానికి వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం, నిరాధార విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పే దిశలో కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో స్పందించిన పార్టీ ఇప్పుడు మరింత కఠినంగా నిలబడుతోంది. ప్రభుత్వ విజయాలను, అమలవుతున్న పథకాలను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లే కమ్యూనికేషన్ స్ట్రాటజీ కూడా రూపుదిద్దుకుంటోంది. మీడియా ద్వారా, క్షేత్రస్థాయి కార్యకర్తల ద్వారా ప్రజలకు నిజాలు చేరవేయడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ప్రతిపక్షాలు ఎంత దూకుడు ప్రదర్శించినా వాస్తవాలతో, అంకెలతో, క్షేత్రస్థాయి ఫలితాలతో జవాబు ఇవ్వాలనే నిర్ణయం కాంగ్రెస్ నాయకత్వంలో స్పష్టంగా కనిపిస్తోంది. గ్రౌండ్ లెవెల్‌లో పార్టీ పట్టు మరింత పెరగడం, పథకాల అమలు వేగం అందుకోవడం ఈ రెండూ ఏకకాలంలో జరగడం రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసే సంకేతాలు కనిపిస్తున్నాయి.